**Sakshi**

# 2009 'గ్రూప్-2'పై న్యాయ సలహా

- స్పష్టత కోసం ప్రభుత్వానికి లేఖ
- ఏపీపీఎస్సీ అధికారుల నిర్ణయం
- ఈ నెల 26, 27న కమిషన్ సమావేశం

**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) 2009లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలపై సుప్రీంకోర్టు తీర్పు అమలులో అనేక చిక్కుముడులు ఉండడంతో న్యాయ సలహా తీసుకోవాలని అధికార వర్గాలు భావిస్తున్నాయి. దీనిపై మరింత స్పష్టత కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించాయి. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తే.. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వారిలో దాదాపు 170 మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. గతంలో ప్రభుత్వాలు ఇచ్చిన అనాలోచిత ఉత్తర్వులతో 2009 గ్రూప్-2 న్యాయ వివాదాల్లో చిక్కుకుంది. నోటిఫికేషన్‌లో ఒక జీఓను పేర్కొన్న ఏపీపీఎస్సీ నియామకాలకు వచ్చేసరికి కొత్తగా జీఓ 124ను తెచ్చి అభ్యర్థులను ఎంపిక చేసింది. దీంతో అవకాశాలను కోల్పోయామంటూ కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ అనంతరం 2015 ఫిబ్రవరి 18న న్యాయస్థానం తీర్పు వెలువరించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారమే మెరిట్ జాబితా మళ్లీ రూపొందించి నియామకాలు జరపాలని ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఇటీవల మెరిట్ జాబితాను రూపొందించగా ఇప్పటికే నియామకాలు పూర్తయి దాదాపు 15 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థుల్లో 170 మందికి పైగా ఉద్యోగాలు కోల్పోతారని తేలింది. దీనిపై ఆయా అభ్యర్థులు ఏపీపీఎస్సీకి వచ్చి జాబితా రూపకల్పనలో తప్పులు దొర్లాయని మొరపెట్టుకున్నారు. వారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని మళ్లీ జాబితా రూపొందిస్తామని ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్ హామీ ఇచ్చారు. అయితే, మళ్లీ జాబితా రూపకల్పన విషయంలో ఏం చేయాలో అర్థంకాక అధికారులు తలలు పట్టుకున్నారు. నోటిఫికేషన్ సమయంలో పేర్కొన్న జీఓకు భిన్నంగా నియామకాల సమయంలో కొత్త జీఓను ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని కమిషన్ అధికారులు పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పును యథాతథంగా అమలు చేయక తప్పని పరిస్థితి, అలా చేస్తే ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వందలాది మందికి నష్టం తప్పదని చెబుతున్నారు. వీరికోసం ప్రత్యేకంగా సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించేందుకు ప్రభుత్వం అంగీకరించే అవకాశం లేదంటున్నారు. ఈ నేపథ్యంలో ఏం చేయాలనే దానిపై స్పష్టత కోసం ప్రభుత్వానికి లేఖ రాయాలని కమిషన్ అధికారులు నిర్ణయించారు. అలాగే సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు వచ్చే నెలతో ముగియనుండడంతో ఈలోగా న్యాయసలహా తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో ఏపీపీఎస్సీ సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో తుది నిర్ణయానికి రావొచ్చని తెలుస్తోంది.

## ఖాళీ అవుతున్న ఏపీపీఎస్సీ

2009 గ్రూప్-2, 2011 గ్రూప్-1 కేసులపై సుప్రీంకోర్టు తీర్పుల అమలు, కొత్తగా 4,009 పోస్టుల భర్తీకి జారీ చేయాల్సిన నోటిఫికేషన్లు, ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై ఏపీపీఎస్సీ ఇప్పుడిప్పుడే చర్యలు చేపడుతోంది. ఈ తరుణంలో ఏపీపీఎస్సీ కార్యదర్శి గిరిధర్‌ను తమ సర్వీసుల్లోకి తీసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఏపీపీఎస్సీ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. ఏపీపీఎస్సీకి చైర్మన్ కాకుండా మరో 9 మంది సభ్యులుండాలి. కానీ, ప్రస్తుతం చైర్మన్, మరో సభ్యుడు మాత్రమే ఉన్నారు. సభ్యులను నియమించాలని ఏపీపీఎస్సీ చైర్మన్ కోరుతున్నా ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కిస్తోంది.